క్లుప్తంగా

రూ.3.20 లక్షల ఆర్థికసాయం



కందనూలు: జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు బీసీ కాలనీకి చెందిన పేద విద్యార్థి సాయిపల్లవికి క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నారై చిత్తనూర్ భాస్కర్ రూ. 3.20 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సాయిపల్లవి ఆర్థిక సమస్యతో చదువుకునేందుకు ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న ఎన్నారై భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థిని చదువుకు అయ్యే ఖర్చు మొత్తం భరిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో క్లాస్‌మెట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్, జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, ప్రసాద్, సంబు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ రూ.20 వేల విరాళం



చారకొండ: వెల్దండ మండంలోని చెర్కూర్‌లో ఏర్పాటు చేయనున్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం కోసం మండల కేంద్రానికి చెందిన సర్పంచ్ గుండె విజేందర్ గౌడ్ రూ. 20 వేలు, సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్ రూ.5వేలు విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో విగ్రహ కమిటీ సభ్యులకు వారు నగదు అందజేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో వాసవీక్లబ్ సేవలు

కల్వకుర్తిరూరల్: అంతర్జాతీయ స్థాయిలో వాసవీ క్లబ్ సేవలు కొనసాగుతున్నాయని వాసవీక్లబ్ ఇంటర్‌నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌బాబు అన్నారు. ఆదివారం హైదరాబాద్ జిల్లా 101 రీజియన్ 1 ఆధ్వర్యంలో నిర్వహించిన రీజియన్ కాన్ఫరెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్ ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సామాజిక సేవా కార్యక్రమాలు అందుతున్నాయన్నారు. రీజియన్ చైర్మన్ నాగమణి ప్రవీణ్ దంపతులు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కల్మిచర్ల రమేష్, నాగలక్ష్మి ఉన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థికి శ్రీకాంత్ బీమా దరఖాస్తు



అచ్చంపేట: నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని ఆదివారం నాంపల్లిలో బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకుడు శ్రీకాంత్ బీమా దరఖాస్తు చేసుకున్నారు. అఖిల భారత విద్యార్థి పరిషత్‌లో పనిచేసిన అనుభవం, విలేజ్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గ ప్రజలకు చేసిన సేవ, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నానని వివరించారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్‌కు సన్మానం



చారకొండ: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా నియామకం అయిన గోలి శ్రీనివాస్ రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో వైస్ ఎంపీపీ తనయుడు, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జూపల్లి వెంకట్ యాదవ్, వార్డు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో జంగయ్య, ఎల్క శ్రీను, నాయకులు, సందీప్, మల్లయ్య శ్రీను, మల్లికార్జున్, మల్లేష్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బెల్ట్‌ల ప్రదానం

కందనూలు: జిల్లా కేంద్రంలో జెడ్పీ మైదానంలో ఆదివారం తైక్వాండో కలర్ బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పుంసే, పంచెస్, కిక్స్, స్టాండ్స్ వంటి విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్ట్, సర్టిఫికెట్స్ అందజేశారు. ఎల్లో, గ్రీన్, బ్లూ బెల్ట్‌లను ప్రదానం చేశారు.



అమ్మా.. కరుణించు



మర్రిపల్లిలో ..

చారకొండ: మండల కేంద్రంతో పాటు మర్రిపల్లి, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో ఆదివారం పోచమ్మ, ఈదమ్మ బోనాల పండుగను నిర్వహించారు. గ్రామ దేవతల ఆలయాలను అలకరించి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలను అలకరించి, డప్పు, వాయిద్యాల నడుమ ఊరేగింపుగా అమ్మవారి ఆలయాలను చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విజేందర్ గౌడ్, నరేష్ నాయక్, వసంత సాంబయ్య గౌడ్, ఉప సర్పంచ్‌లు రాణి , కేశవ రెడ్డి, పర్వతాలు నాయకులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



చారకొండలో డప్పువాయిద్యాల మధ్య బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

మండల కేంద్రంలో ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో శాస్త్రోక్తంగా అర్చకులు వేద మంత్రాలతో మధ్య అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామంలో మహిళలు ఎల్లమ్మ తల్లి బోనాల పండగను నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలతో మహిళలు ఊరేగింపుగా దేవాలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలతో కుటుంబాన్ని చల్లగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజేందర్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, నాయకులు నరేందర్ రెడ్డి, యాదయ్య గౌడ్, శ్రీను, యాదగిరి, నాయకులు గ్రామస్తులు ఉన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

చారకొండ: దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మండలంలోని సిర్సనగండ్లలో ఎమ్మెల్యే నిధులు రూ.10 లక్షలతో చేపట్టనున్న ఆంజనేయ స్వామి దేవాలయ పునర్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గువ్వల బాలరాజు భూమిపూజల చేసిన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని మతాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

ఎన్నికల్లో లబ్ధికోసమే అసత్య ప్రచారాలు

మండల కేంద్రంలోని ఎల్లమ్మతల్లి ఉత్సవాలకు ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష నాయకులు తనపై అసత్య ప్రచారాలు మానుకోవాలని సూచించారు. దళితబంధు పథకాన్ని అర్హులకు మాత్రమే ఇచ్చామని అవకతవకలకు పాల్పడలేదన్నారు. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల విజేందర్ గౌడ్, సర్పంచ్ శారద శ్రీనివాస్, ఉప సర్పంచ్ పసుల శ్రీను, అధ్యక్షుడు మండల రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ గుర్వయ్య గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, మోహన్ రెడ్డి, జగ్జీవన్ రెడ్డి, యాదయ్య గౌడ్,ఉప సర్పంచ్‌లు రాణి, శ్రీను నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

మినీ అంగన్‌వాడీ టీచర్లకు అండగా ఉంటాం

అచ్చంపేట రూరల్: మినీ అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మినీ అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు బాణావత్ జ్యోతి ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ విప్‌ను కలిశారు. పలు సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మినీ అంగన్‌వాడీ టీచర్లు ఆశ, కళావతి, మమత, జ్యోతి, కవిత, కేస్లీ, సుగుణ, కిష్టమ్మ, సరోజ, లక్ష్మి పాల్గొన్నారు.

కురువ, యాదవుల అభ్యున్నతే ధ్యేయం



పెద్దకొత్తపల్లిలో గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి: కురువ యాదవుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా 18 యూనిట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కొక్క యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక పొట్టేలును అందజేస్తున్నామన్నారు. ఈ నెల 16న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభిస్తారని ఈ పథకంతో పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రజల సాగునీరు. తాగునీరు పుష్కలంగా అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రేణుకానాగరాజు, గొర్రెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి యాదవ్, విండో అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రాముయాదవ్, మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, వెంకటేశ్వర్‌రావు, గణేష్‌రావు, సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, కురుమయ్య, నాగరాజు, సుగుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

కొల్లాపూర్: నియోజకవర్గంలోని పెద్దదగడ, సింగవరం, పెంట్లవెల్లి గ్రామాలకు చెందిన పలువురు ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు రంగినేని అభిలాష్‌రావు, రఘువర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సురేందర్‌గౌడ్ తదితరులున్నారు.

మొక్కజొన్నకు అడవి పందుల బెడద



బల్మూర్: మండలంలోని అడవి సమీప గ్రామాలైన మైలారం, బల్మూర్, అంబగిరి, లక్ష్మీపల్లి, చెంచుగూడెం, వీరంరాజ్‌పల్లి, అనంతవరం ప్రాంతాల్లో మొక్కజొన్న పంటలపై అడవి పందులు గుంపులుగా వచ్చి ధ్వంసం చేస్తున్నాయి. రోజురోజుకు పందుల బెడద అధికం అయ్యిందని రైతులు వాపోయారు. దీంతో పంటలు దెబ్బతిని నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు స్పందించి పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేడు బీజేపీ నిరసన దీక్ష

కొల్లాపూర్: పట్టణంలో మామిడి మార్కెట్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు సోమవారం 48 గంటల పాటు నిరసన దీక్ష చేపట్టనున్నట్లు అసెంబ్లీ కన్వీనర్ మేకల శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో దీక్ష నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. మామిడి రైతులు దీక్షకు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రజావాణి..

పెంట్లవెల్లి/కోడేరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహిస్తునట్లు ఆయా మండలాల తహసీల్దార్లు జమీల్, సైదులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోతులను ఇతర ప్రాంతాలకు తరలించాలి



మన్ననూర్: అచ్చంపేటలో కోతులు అధికంగా ఉన్నాయని ఫిర్యాదు రావడంతో అధికారులు అక్కడి నుంచి మన్ననూర్ ప్రాంతంలో వదిలివెళ్లడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మన్ననూర్‌లో కోతుల బెడద అధికంగా ఇక్కడి నుంచి అటవీ ప్రాంతాలకు తరలించాలని అధికారులను కోరారు. కొన్నేళ్లుగా మన్ననూర్ పరిసర గ్రామాలలో కోతుల బెడద అధికంగా ఉండటంతో పొలాలను సాగు చేయడం లేదని స్థానికులు వివరించారు. వ్యవసాయం చేసేందుకు వీలు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఒత్తిడి పెంచాలి



కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం కేంద్రంపై కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి పెంచాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్‌రావుకు వారు వినతిపత్రం అందజేశారు. పార్టీ దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాముయాదవ్, గాదెల సుధారాణి, ఎమ్మార్పీఎస్ నాయకులు సులిగిరి శ్రీనివాసులు, సంపంగి మద్దిలేటి, కొండూరు రాములు తదితరులున్నారు.

అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ



పెద్దకొత్తపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కొల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌రావు అన్నారు. మండలంలోని వెనచర్లలో ఆదివారం గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి ప్రచారం చేశారు. రూ.500 కే సిలిండర్, అర్హులందరకీ రూ.4 వేల పింఛన్ ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాముయాదవ్, బాలపీరు, రసూల్, కురుమయ్య, ఖాజా, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగుకాల్వతో అవస్థలు

తాడూరు: మండల కేంద్రంలోని ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డుకు సమాంతరంగా మురికి కాల్వ నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారు. పక్కనే ఆర్ అండ్‌బీ రోడ్డుకు అనుసరించుకొని ఉండడం, పక్కనే పోచమ్మ ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుర్గంధ వాసన వెదజల్లుతోంది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగుకాల్వ వెడల్పుగా ఉండటంతో వాహనదారులు ప్రయాణించేందుకు జంకుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి అసంపూర్తిగా వదిలిన మురుగుకాల్వను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అసంపూర్తిగా మురుగుకాల్వ

అన్యమత ప్రచారం సరికాదు



కొల్లాపూర్: హిందూ మతంపై అన్యమతస్తులు అసత్య ప్రచారాలు చేయడం సరికాదని ధర్మ జాగరణ్ విభాగ్ ప్రముఖ్ లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మాధవస్వామి దేవాలయంలో ధర్మజాగరణ్ కొల్లాపూర్ శాఖ సమావేశం నిర్వహించారు. పట్టణంలోని బేడ బుడగజంగాల కులస్తులకు దేవుళ్ల చిత్రపటాలు, పూజా సామగ్రి అందజేశారు. ఆర్థిక పరమైన అంశాలను, అనారోగ్య సమస్యలను ఆసరాగా చేసుకొని కొందరు మత మార్పిడిలకు పాల్పడటం సరికాదన్నారు. కార్యక్రమంలో ధర్మ జాగరణ్ కార్యకర్తలు రఘుపతి, శివలీల, భజరంగ్‌దళ్ నాయకులు సుంకరి పురేందర్, లక్ష్మణ్, కురుమూర్తి తదితరులున్నారు.

ఘనంగా వనమహోత్సవం



గ్రామం నుంచి బయటకు వెళ్తున్న మహిళలు

మన్ననూర్: శ్రావణ మాసం పురస్కరించుకొని మన్ననూర్ గ్రామంలో ఆదివారం వనమహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్, లింగమయ్య, జంగాల, ఉమామహేశ్వర కాలనీలు, వేణుగోపాల స్వామి ఆలయం, పాతబజారు, తదితర కాలనీలకు చెందిన మహిళలు గంపలను అలంకరించుకుని తలపై ధరించి భాజా భజంత్రీల చప్పుళ్లతో తూర్పు, ఉత్తర, దక్షిణం దిశలుగా గ్రామం వెలుపలకు పిల్లా పాపలతో కలిసి వెళ్లారు. ప్రకృతి దేవతలను ఆరాధించి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేసి వనభోజనాలు చేశారు. మహిళలు గొబ్బెమ్మలు, యువకులు చిటుకుల భజనలు, కబడ్డీ ఆటలతో రోజంతా సంతోషంగా గడిపారు.

ముత్తిరెడ్డిపల్లిని కోడేరులోనే కొనసాగించాలి

కోడేరు: ముత్తిరెడ్డిపల్లి గ్రామాన్ని కోడేరు మండలంలోనే కొనసాగించాలని గ్రామస్తులు నిరహార దీక్ష చేపట్టారు. ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎలేని సుధాకర్‌రావు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్తిరెడ్డిపల్లిని ఏదుల మండలంలో కలపడం వల్ల గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. గ్రామాన్ని ఏదుల మండలంలో కలిపేందుకు తీసుకుంటున్న చర్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హన్మంతు, రవికుమార్, బాబు, శరత్‌చంద్రారెడ్డి, నిరంజన్‌గౌడ్, చంద్రమౌళిచారి, రాములు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాతో పాటు తాండ్రా గ్రామంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీన్‌కుమార్ పార్టీ జెండాను ఎగురవేశారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా ఆదివారం నియోజకవర్గంలోని కడ్తాల్ నుంచి కల్వకుర్తి వరకు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్‌ర్యాలీలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో తడకు పరమేష్, మల్లేష్, ఎట్టి ఆంజనేయులు, కొమ్ము శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలకపల్లి: నల్లమల నగర బహిరంగ సభకు మండల కేంద్రం నుంచి బీఎస్పీ నాయకులు బైక్ ర్యాలీగా అచ్చంపేటకు బయలుదేరారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు ఆర్ శివశంకర్, మోహన్‌రెడ్డి. రెడ్డపాకుల శివశంకర్, బాలనాగయ్య, సుల్తాన్, మొగులాలు, రామస్వామి, రామచందర్, పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రానికి ఆదివారం చేరుకున్న బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ బైక్‌ర్యాలీ చేరింది. పార్టీ కార్యకర్తలు, అభిమానులు ప్రవీణ్‌కుమార్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్‌స్టాండ్ ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. బహుజనుల రాజ్యాధికారం తీసుకురావడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు ఉన్నారు.



తెలకపల్లి నుంచి అచ్చంపేటకు బయలుదేరిన బీఎస్పీ నాయకులు

చాకలి ఐలమ్మకు ఘన నివాళి



కొల్లాపూర్‌లో



నాగర్‌కర్నూల్‌లో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సీపీఎం, సీపీఐ నాయకులు వేర్వేరుగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వర్ధం పర్వతాలు, భరత్‌లు ఆర్ శ్రీనివాసులు, అశోక్, అంతటి కాశన్న, వెంకటయ్య, మోహన్, రవికుమార్, కృష్ణ, బార్గవ్, బహుగుణ, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ఐలమ్మ విగ్రహం వద్ద ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ వివిధ సంఘాల నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గణేష్‌రావు పూలమాల వేశారు. ఆమె సేవలను కొనియాడారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో పలు పార్టీల నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మల్లయ్య, పరుషరాములు, వెంకటేశ్వర్లు, సర్దార్‌నాయక్, సదానందం, శ్రీనివాసులు, గోపాల్, రాజేందర్ తదితరులతోపాటు పలువురు పాల్గొన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం నాయకులు, బీఆర్‌ఎస్, సీపీఎం పార్టీల నాయకులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కోడేరు: మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. అధ్యక్షుడు దాసరి రాజు, రవి పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని అంతారంలో బీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు ఐలమ్మకు నివాళులర్పించారు.

చారకొండ: మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమెకు సర్పంచ్ విజేందర్ గౌడ్ పూలమాల వేశారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో సీపీఎం జిల్లా నాయకుడు ఈశ్వర్ ఐలమ్మ వర్ధంతికి హాజరయ్యారు.

తెలకపల్లి: ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయమని రజక సంఘం నాయకులు పేర్కొన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘం సమావేశాలు

కందనూలు: జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ భవన్‌లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ శాంతకుమారి అధ్యక్షతన సోమవారం నుంచి జెడ్పీ స్థాయీ సంఘం సమావేశాలు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ఉషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 2, 3, 4, 5వ స్థాయి సంఘాలు, మధ్యాహ్నం 1, 6, 7 స్థాయి సంఘాల సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సంఘం సభ్యులతో పాటు జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.